అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో ఆర్టీసీ ఉద్యోగుల సత్తా


చాంపియన్‌షిప్ పోటీలో సత్తాచాటిన కండక్టర్ మంజుల

మూసాపేట: గచ్చిబౌలి స్టేడియంలో నేషనల్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో కూకట్‌పల్లి ఆర్టీసీ ఉద్యోగస్తులు తమ సత్తా చాటారు. కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో కండక్టర్ మంజుల హై జంప్‌లో గోల్డ్ మెడల్, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్, ట్రిపుల్ జంప్‌లో సిల్వర్ మెడల్, కండక్టర్ శ్రీదేవి 300 మీటర్ల హార్డల్స్‌లో సిల్వర్ మెడల్, కానిస్టేబుల్ సోమేశ్వరరావు ట్రిపుల్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. డిపో మేనేజర్ మహ్మద్ ఇషాక్ వారిని అభినందించారు. ఇటువంటి పోటీల్లో పాల్గొని మరిన్ని మెడల్స్ సాధించాలని అన్నారు.

ఫంక్షన్‌హాల్ ప్రారంభం


హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి, వడ్డేపల్లి రాజేశ్వరరావు



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌కాలనీ రిక్రియేషన్ సెంటర్ ఆవరణలో వడ్డేపల్లి నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు తన సొంత నిధులతో ఫంక్షన్‌హాల్‌ను నిర్మించారు. సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ముఖ్యఅతిథులుగా హాజరై ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఫంక్షన్‌హాల్‌ను కాలనీవాసులు ఉపయోగించుకునే విధంగా నిర్మించడానికి ముందుకొచ్చిన రాజేశ్వరరావుకు ప్రత్యేక అభినందనలు అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సొసైటీ సభ్యులు, కాలనీ వాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్‌యూ నూతన కార్యవర్గం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని దళిత విద్యార్థి సంఘం (డీఎస్‌యూ) నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. కన్వీనర్ కూచిపూడి రాజా, కో కన్వీనర్ తుంగ రమేష్ ఆధ్వర్యంలో ఏకంగా 32 మందితో కూడిన జంబో కార్యవర్గం ఏర్పాటైంది. నూతన అధ్యక్షుడుగా సిలపాక వెంకటాద్రి, కార్యదర్శులుగా ఈర్ల కమలాకర్, ఉమేష్ అంబేద్కర్, నూతన ఉపాధ్యక్షుడుగా వర్ధన్‌తేజ, కోకన్వీనర్ శేఖర్, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రజావాణిలో 29 ఫిర్యాదులు


ప్రజావాణి జెడ్‌సీకి సమస్యలపై వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని జెడ్‌సీ అభిలాష అభినవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ పరిధిలోని ప్రజలు ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించాలని జెడ్‌సీకి వినతిపత్రాల అందజేశారు. మూసాపేట నుంచి2, కూకట్‌పల్లి నుంచి 1, కుత్బుల్లాపూర్ నుంచి 9, గాజులరామారం నుంచి 7, కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం పరిధి నుంచి 10 మొత్తం 29 మంది వినతిపత్రాలను అందజేసినట్లు జెడ్‌సీ తెలిపారు. అనంతరం జెడ్‌సీ మాట్లాడుతూ.. అధికారులు సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రం అందజేత


ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం, పాపిరెడ్డినగర్ నివాసి గుజ్జుల శ్రీనివాసరెడ్డి ప్రమాదవశాత్తు కుడికాలు తొలగించాల్సి వచ్చింది. కృత్రిమ కాలు శస్త్ర చికిత్సకై కూకట్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును సంప్రదించారు. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ సందర్భంగా మంజూరైన రూ.1.25 లక్షలు ఎల్‌ఓసీ పత్రాలను సోమవారం జగదీశ్వర్‌గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు శివ, వనం ఆంజనేయులు, ఎల్లారెడద్ది, సులోచన, అశోక్‌చారి, శాం సుందర్‌రావు తదితరుల పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ ఇచ్చి తీసేస్తామని నోటీసులు

ఇబ్బందులకు గురిచేస్తున్నారని యజమానుల ఆవేదన


ట్రాన్స్‌కో సిబ్బంది బిగించిన విద్యుత్ మీటర్

కూకట్‌పల్లి: గతంలో వినియోగదారులకు విద్యుత్ మీటర్ ఇచ్చిన అధికారుల సూచన మేరకు ఇచ్చిన మీటర్‌కు నోటీసులు ఇస్తున్నారు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కైత్లాపూర్ సర్వే నం.1007లో విద్యుత్ మీటర్ కోసం చంద్రశేఖర్‌రెడ్డి అనే వినియోగదారుడు దరఖాస్తు చేసుకున్నాడు. నిబంధన ప్రకారం అన్ని డాక్యుమెంట్లు, సెల్ఫ్ డిక్లరేషన్ సైతం పొందుపరిచాడు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులు మీటర్ మంజూరు చేశారు.

◆ వినియోగదారుడు నిర్మించిన రూమ్ వద్ద విద్యుత్‌శాఖ సిబ్బంది మీటర్‌ను బిగించారు. అనంతరం ఏఈ, క్రింది స్థాయి సిబ్బందిపై పెత్తనం చేస్తున్న టాన్స్‌కో, ఉన్నతాధికారులు బిగించిన మీటర్‌కు నోటీసుల ఇస్తూ ఇబ్బందులకు గురి చేశారు. ప్రజలు కట్టిన పన్నులతో జీతభత్యాలు తీసుకుంటున్న ట్రాన్స్‌కో అధికారులు వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కేపీహెచ్‌బీకాలనీలోని ట్రాన్స్‌కో, అధికారులు తీరుపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల బదిలీలు..!

- లోక్‌సభ ఎన్నికలకు ప్రారంభమైన సన్నాహాలు
- కొనసాగుతున్న మొదటి విడత ఈవీఎంల తనిఖీ
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఓటర్ల తుది జాబితా విడుదల



సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికలకు సన్నాహాలు కొనసాగుతున్న వేళ.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల బదిలీల ప్రక్రియ మొదలైంది. శాసనసభ ఎన్నికల సమయంలోనే బదిలీలు చేపట్టాల్సి ఉండగా కేవలం తహసీల్దార్ల వరకు మాత్రమే నిర్వహించారు. ఈసారి పలు శాఖల్లో పెద్దఎత్తున బదిలీలు జరుగుతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే ఒకేచోట మూడేళ్లు పైబడిన, జిల్లా ఆవిర్భావం నుంచి ఇక్కడే పాతుకుపోయిన ఉద్యోగుల వివరాలతో నివేదిక ప్రభుత్వానికి పంపించిన విషయం తెల్సిందే. దీంతో బదిలీల ప్రక్రియ జోరందుకుంది. ఆదివారం ముగ్గురు ఎంపీడీవోలను రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు పంపించారు. డీఆర్డీవో, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఆబ్కారీ, పోలీసు తదితర శాఖల్లో దీర్ఘకాలికంగా, స్థానికులై ఉండి పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కల్పించారు. ఇతర జిల్లాల నుంచి డిప్యూటేషన్లపై వచ్చిన వారిని కూడా వెనక్కి పంపించడానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

జోరందుకున్న బదిలీలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బదిలీలు జోరందుకున్నాయి. జిల్లా పరిషత్ సీఈఓ దేవసహాయం నాగర్‌కర్నూల్ జిల్లాకు జెడ్పీ సీఈఓగా బదిలీ కాగా, ఈయన స్థానంలోకి రంగారెడ్డి జిల్లాకు చెందిన జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్‌ను బదిలీ చేశారు. అలాగే మేడ్చల్ జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓ సరిత జనగామ జిల్లాకు బదిలీ కాగా, ఆమె స్థానంలోకి రంగారెడ్డి జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓ నీరజను బదిలీ చేశారు. డీఆర్‌డీఏ పద్మజారాణి కామారెడ్డి జిల్లా డీఆర్‌డీఏగా బదిలీ కాగా, ఆమె స్థానంలోకి వెయిటింగ్‌లో డిప్యూటీ సీఈఓ సాంబశివరావును డీఆర్‌డీఏగా బదిలీ చేశారు. మేడ్చల్ ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్ వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారిగా బదిలీ కాగా, ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఎక్సైజ్ అధికారి ఫయాజిద్దీన్‌ను నియమించారు. మల్కాజిగిరి ఎక్సైజ్ అధికారి అరుణ్‌కుమార్‌ను గద్వాల్ జిల్లాకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో భువనగిరి–యాదాద్రి జిల్లాకు చెందిన ఎక్సైజ్ అధికారి నవీన్‌కుమార్ బదిలీపై వచ్చారు. జిల్లా పంచాయతీ శాఖ అధికారి రమణమూర్తిని వనపర్తి జిల్లాకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో ములుగు జిల్లాకు చెందిన కొండ వెంకయ్యను డీపీఓగా బదిలీ చేశారు. డీపీఓ రమణమూర్తి పనితీరుపై ఇప్పటికే కలెక్టర్ సీరియస్‌గా ఉండగా, జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీ) అభిషేక్ అగస్త్య గతంలో ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కోరినప్పటికీ, రాజకీయ పలుకుబడితో ఇక్కడే కొనసాగినట్లు తెలుస్తోంది.

మొదలైన లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. ఎన్నికల నిర్వహణ తీరుపై నియోజకవర్గ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కలెక్టరేట్లో మొదటి విడత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల తనిఖీ కొనసాగుతోంది.

◆ మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో ఏడు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. కొద్ది రోజుల్లోనే పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో శాసనసభ నియోజకవర్గాల్లో ఈవీఎంల మొదటి విడత తనిఖీ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్ గౌతమ్ అధ్వర్యంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీ పాట్స్, కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు పరిశీలన కొనసాగుతోంది. ఈనెల 14 వరకు తొలి విడత ఈవీఎంల తనిఖీ పూర్తికానుంది. ఆ తర్వాత ఈవీఎంల ర్యాండమైజేషన్ కొనసాగుతుంది. ఈ విధానం ఎన్నికలు నిర్వహించే సమయానికి మూడు విడతలుగా చేపట్టనున్నారు. చివరకు ఎలాంటి లోపాలు లేని ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు పంపిస్తారు.

గోమాతను రక్షించుకోవాలి

- అఖిత భారత గో సేవ ఫౌండేషన్ నిర్వాహకుడు బాలకృష్ణ
- దేశీ ఆవుపాలు పార్టీ ప్రారంభం



దేశీ ఆవుపాలు పార్టీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బాలకృష్ణ గురుస్వామి తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: ఆవుపాలు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని గోవు ఒక కులానికో.. మతానికో చెందినది కాదని ప్రతి ఒక్కరికి ఒకే రకమైన పాలు ఇస్తుందని... అలాంటి ఆవులు అన్యాక్రాంతం అవుతున్నాయని అఖిత భారత గో సేవ ఫౌండేషన్ నిర్వాహకుడు బాలకృష్ణ గురుస్వామి అన్నారు. సోమవారం కూకట్‌పల్లి జయనగర్ కాలనీలో స్వదేశీ నేచురల్ ప్రొడక్ట్స్ వారు దేశీ ఆవుపాలు పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గోమాతను రక్షించాలన్నారు.

ప్రతిరోజు 50వేల గోవులను సంహరిస్తున్నారు..

ఆధునిక సైన్స్ వల్ల సాధ్యం కాని ఎన్నో విషయాలు మానవ జీవనంలోని ఆటంకాలను అధిగమించేందుకు ఆవు ద్వారా 100 శాతం సాధ్యమవుతుందన్నారు. భారతదేశంలో ప్రతి రోజు 50వేల ఆవులను మాంసానికి వినియోగిస్తున్నారని తెలిపారు. పూర్వం 150 కోట్లు ఉన్న ఆవులు ప్రస్తుతం 10 కోట్లు అంతరించాయని అన్నారు. ఈ దుశ్చర్యను నిర్మూలించి గోవులను రక్షించాలని కోరారు. గోమాత పంచగవ్యాలను ఉపయోగించి తక్కువ ఖర్చుతో అన్ని రకాల రోగాలను రక్షించడానికి గోమాత ఉపయోగపడుతుందనినారు. గోవులను రక్షించి హిందూ సంప్రదాయాలను కాపాడాలని కోరారు.



పోరుగర్జన సభకు లక్షలాదిగా తరలిరండి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఆల్విన్‌కాలనీ: కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి చెందిన కృష్ణా రివర్ మేనేజిమెంట్ బోర్డుకు అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం నల్లగొండలో జరిగే పోరు గర్జన సభకు లక్షలాదిగా తరలి రావాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సోమవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నల్లగొండలో జరిగే పోరుగర్జన సభకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఏరియా కమిటీ, బస్తీ కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు తదితరులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను గండి కొట్టే విధంగా కృష్ణానది మీద ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను కేంద్రానికి దారాదత్తం చేస్తూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఈ గర్జన సభకు లక్షలాదిగా తరలి రావాలని కోరారు.

కనకదుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే కృష్ణారావు



కూకట్‌పల్లి: విజయవాడ కనకదుర్గమ్మను సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో సంతోషంగా ఉండాలని కోరుకున్నానని తెలిపారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కూకట్‌పల్లి కోఆర్డినేటర్ సతీష్ అరోరా, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొ. డా. శ్రీనివాస్‌రావు లేరనేది నమ్మలేకపోతున్నాం

- జేఎన్‌టీయూ వైస్‌చాన్సలర్ డా. కట్టా నర్సింహారెడ్డి
- సంతాప సభలో నివాళులర్పించిన ప్రొఫెసర్లు, విద్యార్థులు

బాలానగర్: జేఎన్‌టీయూలో శనివారం మృతి చెందిన ఈసీఈ డిపార్టుమెంట్ సీనియర్ ప్రొఫెసర్ డా. డి.శ్రీనివాస్‌రావు సంతాప సభను సోమవారం వైస్‌చాన్సలర్ డా. కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ డా. విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా.వెంకటేశ్వర్‌రావు పాత ఐఎస్‌టీ బిల్డింగ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అన్ని డిపార్టుమెంట్‌ల ప్రొఫెసర్లు, కాలేజీ అధికారులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు.

◆ ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ.. డా. శ్రీనివాస్‌రావు వ్యక్తిత్వం చాలా మంచిదన్నారు. అనేక సందర్భాల్లో కలిసి తనకు అప్పగించిన పనిపట్ల ఆ పని ప్రోగెస్‌ను ఇక ముందు చేయబోయే పని విధానం చాలా కూలంకుశంగా వివరించేవారన్నారు. ఆయన మన మధ్య లేరు అనే విషయం ఇప్పటికీ నమ్మలేకపోతున్నామన్నారు.

◆ ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ఓ మంచి అనుభవం గల అధ్యాపకుని కోల్పోయిన సందర్భంగా చాలా విచారకరం అన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో పరామర్శకు వెళ్లిన తనకు అతడికి అప్పటించిన పని విషయంపై వివరణ ఇచ్చారని గుర్తు చేశారు. ఇది ఆయనకు తన వృత్తి పట్ల ఉన్న అంకిత భావాన్ని తెలుపుతుందన్నారు. సంతాప సభకు హాజరైన వారందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి డా. శ్రీనివాస్‌రావుకు నివాళులర్పించారు.


ప్రొఫెసర్ డా. డి.శ్రీనివాస్‌రావు సంతాప సభలో మాట్లాడుతున్న వీసీ డా. కట్టా నర్సింహారెడ్డి

ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం

శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్


హైదర్‌నగర్ డివిజన్ గౌతమినగర్‌లో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్న జగదీశ్వర్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని గౌతమినగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులు సోమవారం కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. గౌతమినగర్‌లో 80 అడుగుల లోతు సెల్లార్ తీయడం వల్ల రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ కింగిపోయింది. దీంతో తమ నివాస సముదాయాలు కుంగిపోతాయేనని భయాందోళనతో ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించిన ఆయన కనస్ట్రక్షన్ కంపెనీ వారు కనీసం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టలేదని, ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించాలని కోరారు. యుద్ధ ప్రాతిపదికన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమస్యన పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, ఇతర అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కూన సత్యం గౌడ్, కొడాలి రవి, కావూరి ప్రసాద్, శ్రీకాంత్, సాద మహేష్, రాజిరెడ్డి, మురళి, మోహన్ రెడ్డి, పరుచూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నియమ నంబంధనలను పాటించటం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని ప్రిన్సిపాల్ డా. ఎన్. అలివేలు మంగమ్మ అన్నారు. సమావేశంలో పాల్గొన్న అదనపు డిసిపి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనల ఉల్లంఘన వల్ల దేశంలో ఏటా రెండు లక్షలకు పైన మరణాలు సంభవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నాగేష్, ఎస్‌ఐ శేఖర్, ఎస్‌సిఎస్‌సికి చెందిన నిషా తదితరులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, వాటి ఉల్లంఘనలపై జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల జాతీయ సేవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. భవాని, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డా. వాణి, జి.రవికుమార్, బాలరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

మోతీనగర్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని తెలంగాణ వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రకాష్‌రావు పేర్కొన్నారు. సోమవారం మోతీనగర్‌లోని బడ్స్ అండ్ బ్లూమ్స్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య వివాహ పరిచయ వేదిక

మోతీనగర్: బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య, వెస్ట్ జోన్, అనుబంధ సంస్థల ఆధ్వర్యలలో సోమవారం వివాహ పరిచయ వేదిక 2024 పాండురంగానగర్‌లోని విజేత విద్యాలయలో నిర్వహించారు. హైదరాబాద్, విదేశాల్లో, రెండు తెలుగు రాష్ట్రాలలోని బ్రాహ్మణ బంధువుల వేదికగా ఏర్పాటు చేశారు. సుమారు 650 మంది దరఖాస్తుదారులు నమోదు చేసుకున్నారు. వారికి వివాహ సమాచార పుస్తకాలను అందజేశారు. 11 మంది వధూవరుల తల్లిదండ్రులు ఈ పరిచయ వేదికగా ముఖాముఖి చర్చించుకొని వివాహానికి అంగీకారం తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య, వెస్ట్ జోన్ చేసిన కృషిని అందరు కొనియాడారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యవర్గం 2024–27 సంవత్సరానికి గాను చైర్మన్‌గా చక్కిలం సుధాకర్, ప్రెసిడెం సి.ప్రభాకర్‌రావు, జనరల్ సెక్రటరి కూచి చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారికి బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య తరపున సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఐఎస్. రమేష్, టీడీవీ ప్రసాద్, కె.లక్ష్మీకాంతరావు, రాయప్రోలు రాఘవశర్మ, రామచంద్రరావు, జయలక్ష్మి, అనిత, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.


బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక పుస్తకాలను ప్రదర్శిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య నాయకులు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ మినీ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఖార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 3నెలల క్రితం కుట్టు మెషిన్ శిక్షణ ఏర్పాటు చేశారు. సోమవారం అందులో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కార్పొరేటర్ సబిహా బేగం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మహిళలు స్వయం శక్తితో ముందుకు కొనసాగాలన్నారు. మూడు నెలల పాటు ఉచితంగా కుట్టు మెషిన్‌లో శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాహిద్ షరీఫ్‌బాబా, శ్రీనివాస్ యాదవ్, కొండయ్య, మోయిజ్, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, ముత్యాల దుర్గ, పర్వీన్, సుల్తానా, రేవతి, లక్ష్మి, చిట్టెమ్మ, మణెమ్మ పాల్గొన్నారు.

మార్కెటింగ్ రంగంపై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న ఎంఎస్‌ఎంఈ ఏడీసీ డి.చంద్రశేఖర్

బాలానగర్: ఎగుమతి, మార్కెటింగ్ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎంఎస్‌ఎంఈ వ్యాపారవేత్తలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకు వెళ్లాలని ఎంఎస్‌ఎంఈ అదనపు డెవలప్‌మెంట్ కమిషనర్ (ఏడీసీ) డి.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం బాలానగర్‌లోని ఎంఎస్‌ఎంఈ కార్యాలయం ఆవరణలో వ్యాపారవేత్తలకు ఎగుమతి, మార్కెటింగ్ రంగాలపై ఐదు రోజుల అవగాహన సదస్సును ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక సహాయ పథకాలు, అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలు, ప్రొక్యూర్‌మెంట్ పాలసీ, విదేశీ వాణిజ్య విధానం, తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఫారిన్ ట్రేడ్ డాక్టర్ పున్నం కుమార్, ఎంఎస్‌ఎంఈ సహాయ సంచాలకుల ఎంవీ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడితో రెస్టారెంట్ ప్రారంభం



సాక్షి సిటీ బ్యూరో: షోరూమ్స్, రెస్టారెంట్స్ ప్రారంభించేందుకు సెలబ్రిటీలను తప్ప మరొకరిని ఊహించని రోజుల్లో ఓ అనాథ వృద్ధుడితో తమ రెస్టారెంట్ ప్రారంభించి సరికొత్త ట్రెండ్‌కు తెర తీసింది నగరానికి చెందిన జిస్మత్ జైల్ మండీ రెస్టారెంట్. కూకట్‌పల్లి, ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన తమ నూతన శాఖను గోపి (70)ఏళ్ల అనాథ వృద్ధుడి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక లోనూ శాఖలు నిర్వహిస్తున్న తమ సంస్థకు 19 రెస్టారెంట్స్ ఉన్నాయని, ఇప్పటి వరకు సోనూసూద్, విష్వక్ సేన్ తదితర టాప్ స్టార్స్‌తో వాటిని లాంచ్ చేశామన్నారు. అయితే ఇకపై అనాథలు, నిరాశ్రయులు, నిరుపేదలతో కొత్త బ్రాంచీల ప్రారంభోత్సవాలు నిర్వహిస్తామని అంతే కాకుండా వారిని దత్తత తీసుకుని వారి బాగోగులు చూసుకుంటామన్నారు.